DYNAMIC EDITION

# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 2

శుక్రవారం, నవంబరు 17, 2023

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## అమిత్ షా తెలంగాణ పర్యటన షెడ్యూల్‌లో మార్పులు

హైదరాబాద్ (వాయిస్ టుడే): కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన షెడ్యూల్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ రాత్రికే హైదరాబాద్‌కు అమిత్ షా రావాల్సి ఉంది. కొన్ని కారణాల రీత్యా అమిత్ షా రేపు మధ్యహ్నం 12గంటలకు హైదరాబాద్‌కు రానున్నారు. బేగంపేట్ నుంచి నేరుగా గద్వాల సభకు అమిత్ షా వెళ్లి ప్రసంగిస్తారు. తర్వాత నల్లగొండ, వరంగల్ జిల్లాలో షా ఎన్నికల ప్రచారం నిర్వహచనున్నారు. తర్వాత హైదరాబాద్‌కు అమిత్ షా వచ్చి బీజేపీ మేనిఫెస్టోను విడుదల చేయనున్నారు. అనంతరం సికింద్రాబాద్ క్లాసిక్ గార్డెన్‌లో మాదిగ రిజర్వేషన్ల పోరాట సమితితో పాటు అన్ని అనుబంధ విభాగాలతో నిర్వహించే జాతీయ సమావేశానికి అమిత్ షా హాజరవుతారు. ఈ భేటీ ముగిశాక అక్కడి నుంచి ఆయన నేరుగా అహ్మదాబాద్‌కు షా వెళ్తారు.






## కాంగ్రెస్ మేనిఫెస్టో ఇదే..

- నిరుద్యోగ నిర్మూలన
- ద్యోగం కల్పించే వరకు రూ.4 వేల నిరుద్యోగ భృతి
- మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ
- మొదటి ఏడాదిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ
- 18 సంవత్సరాల పైబడి చదువుకునే ప్రతీ యువతికి ఎలక్ట్రిక్ స్కూటర్లు
- ఎస్సీ రిజర్వేషన్ల పెంపు.. ఏబీసీడీ వర్గీకరణ
- బెల్ట్ షాపులు రద్దు
- తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఎంటి స్థలం, గౌరవ భృతి
- వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్. 3 లక్షల వడ్డీ లేని పంట రుణం.
- కోతుల నివారణకు ప్రతీ జిల్లాలో స్టెరిలైజ్ కేంద్రం.
- కాళేశ్వరం అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ.
- చెరువుల నిర్వాహణ, మరమ్మతుల బాధ్యత నీటి సంఘాలకు అప్పగింత.
- తొలి క్యాబినెట్‌లో మెగా డీఎస్సీ
- రూరల్ యూత్ ఫైనాన్స్ కార్పోరేషన్‌కు రూ.1000 కోట్ల బడ్జెట్.
- విద్యార్థులకు ఫ్రీ ఇంటర్ నెట్.
- విద్యా రంగానికి బడ్జెట్‌లో 6 నుంచి 15 శాతం వరకు పెంపు.
- ఖమ్మం, ఆదిలాబాద్‌లలో నూతన విశ్వవిద్యాలయాలు.
- వైద్య రంగం బడ్జెట్ రెట్టింపు.
- ధరణి స్థానంలో భూమాత పోర్టల్.
- రేషన్ ద్వారా సన్న బియ్యం , రేషన్ డీలర్‌లకు రూ.5 వేల గౌరవ భృతి.
- కొత్త రేషన్ కార్డులు.
- 200 యూనిట్ల లోపు ఉచిత కరెంటు.
- ఆర్టీసీని ప్రభుత్వంలో వీలీన పక్రియ పూర్తి చేస్తాం.
- ప్రతీ ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం.
- కళ్యాణమస్తు కింద లక్ష రూపాయలతో పాటు 10 గ్రాముల బంగారం.
- మహిళా సంఘాలకు పావులా వడ్డీ రుణాలు.
- జూనియర్ న్యాయవాదులకు మొదటి 5 సంవత్సరాలు నెలకు రూ.5 వేల గౌరవ భృతి.
- 100 కోట్లతో జర్నలిస్ట్‌ల సంక్షేమ నిధి.
- హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాల్లో జర్నలిస్టుల ఇళ్ళ సమస్యకు పరిష్కారం.
- ఎన్నారైల సంక్షేమ బోర్డ్ .
- దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్.
- దేవాలయాలకు దూప దీప నైవేద్యం కింద నెలకు రూ.12 వేలు

# తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల



హైదరాబాద్ (వాయిస్ టుడే): తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదలైంది. శుక్రవారం ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే మేనిఫెస్టోను విడుదల చేశారు. మొత్తం 37 అంశాలతో కాంగ్రెస్ మేనిఫెస్టోను రూపొందించారు. తమ మేనిఫెస్టో తెలంగాణ ప్రజలకు అంకితమని ఖర్గే అన్నారు. సర్వమతాలకు కాంగ్రెస్ మేనిఫెస్టో హామీ పత్రమని, హిందువులకు భగవద్గీత , ముస్లింలకు ఖురాన్, క్రిస్టియన్లకు బైబిల్ మాదిరిగా కాంగ్రెస్ పార్టీకి మేనిఫెస్టో అంతటి విలువైనదని ఏఐసీసీ చీఫ్ వ్యాఖ్యానించారు. దాదాపు 42 పేజీలతో కాంగ్రెస్ మేనిఫెస్టోను రిలీజ్ చేసింది. అలాగే జాబ్ క్యాలెండర్‌ను కూడా హస్తం పార్టీ విడుదల చేసింది. గ్రూప్ - 1 ఉద్యోగాల భర్తీ డేట్‌ను కూడా ప్రకటించింది. ఫిబ్రబర్ 1, 2024లో ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది.



## ధరణిని తీసేసి భూ భారతి తెస్తరట..

### మళ్ల గదే పైరవీకారులు, గదే దళారీలు: సీఎం కేసీఆర్

చొప్పదండి (వాయిస్ టుడే): కాంగ్రెస్ పార్టీ ఇయ్యాల మ్యానిఫెస్టో విడుదల చేసిందని, దానిలో ఇప్పుడున్న ధరణిని తీసేసి దాని స్థానంలో భూ భారతిని తీసుకొస్తమని ప్రటించిందని సీఎం కేసీఆర్ తెలిపారు. భూ భారతి కొత్తదేం కాదని, గతంలో తీసుకొచ్చారని, అయినా దానితోటి ఏం గాలేదని సీఎం చెప్పారు. భూ భారతి తెచ్చినా గదే పైరవీకారులు, గదే దళారీలు ఉండేదని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా చొప్పదండిలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. 'ఇయ్యాల కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో ప్రకటించిందట. ధరణిని తీసేసి దాని స్థానంలో కొత్త పోర్టల్ తెస్తరట. దానికి 'భూ భారతి' అని పేరు పెడుతరట. ఈ భూ భారతి కొత్తదేం గాదు. గతంలోనే 30, 40 ఏండ్ల కింద తెచ్చిండ్రు. దాంతోటి ఏంగాలే. మళ్ల పాత కథనే ఉండె. గదే పైరవీకారులు, గదే దళారీలు, అదే పాత కథ ఉండె. కాబట్టి మీరు బాగా ఆలోచించాలి. బీఆర్ఎస్ పార్టీ 24 గంటల కరెంటు ఇస్తున్నది. కాంగ్రెస్ పార్టీ మూడు గంటలు చాలు అంటున్నది. మరె 24 గంటలోడు కావాల్నా.. మూడు గంటలోడు కావాల్నా మీరే తేల్చాలి. మేం రైతుబంధు ఇస్తున్నం. కాంగ్రెసోళ్లు రైతుబంధు వేస్ట్ అంటున్నరు. మరె రైతుబంధు ఇచ్చెటోళ్లు కావాల్నా.. రైతుబంధు వేస్ట్ అనేటోళ్లు కావాల్నా మీరే నిర్ణయించుకోవాలె' అని సీఎం సూచించారు.

'బీఆర్ఎస్ పార్టీ భూముల క్రయవిక్రయాల్లో అక్రమాలకు తావు లేకుండా ధరణి పోర్టల్ తెచ్చింది. వాళ్లు ధరణిని బంగాళాఖాతంలో వేస్తమంటున్నరు. మరె ధరణి పోర్టల్‌ను ఉంచుకుంటరో.. బంగాళాఖాతంల వేసుకుంటరో మీ ఇష్టం. రైతులకు మేలు జేస్తోడు కవాల్నా.. కిందమీద జేసేటోడు కావాల్నా మీరే తేల్చుకోండి. మీరు ఆలోచించకుంట ఓటేస్తే ఆగమైతరు. అప్పుడు నేను గూడా ఏం జేయలేను. పదేళ్లుగా మేం పడ్డ కష్టం బూడిదల పోసిన పన్నీరయితది. కాబట్టి ఇవన్నీ ఆలోచించి, ఎవరిని గెలిపిస్తే రాష్ట్రం బాగుపడుతదో చూసి ఓటేయండి. ఇంక గోపాల్‌రావు పేట, ఘర్షకుర్తిలను మండలాలు చేయాలని మీ ఎమ్మెల్యే రవిశంకర్ కోరిండు. అదేం పెద్దపని కాదు. నిమిషాల మీద జీవో ఇష్యూ చేసి ఆ రెండు మండలాలు ఏర్పాటు చేస్తం. మీరు ముందుగా రవిశంకర్‌ను గెలిపియ్యండి. మండలాల ఏర్పాటుతోపాటు రవిశంకర్ కోరిన ఇంకా కొన్ని పనుల సంగతి నేను చూసుకుంట' అని సీఎం హామీ ఇచ్చారు.

## తెలంగాణతో నాకున్నది రక్త సంబంధం



మణుగూరు: తెలంగాణతో తనకున్నది రాజకీయ సంబంధం కాదు.. రక్త సంబంధం అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పినపాక అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మణుగూరులో నిర్వహించిన బహిరంగసభలో రాహుల్ పాల్గొన్నారు. "సీఎం కేసీఆర్ చదువుకున్న బడి కట్టింది కాంగ్రెస్ పార్టీనే. దొరల తెలంగాణ ప్రజల తెలంగాణ మధ్య పోరాటం. ఓ వైపు కుటుంబ పాలన మరోవైపు సామాన్య ప్రజలకు మధ్య పోరాటం. కీలక మంత్రి పదవులన్నీ కేసీఆర్ కుటుంబం వద్దే ఉన్నాయి. ప్రాజెక్టుల్లో లక్ష కోట్ల దోపిడీ. కేసీఆర్ దోచుకున్న సొమ్ములు ప్రజలకు ఖర్చు పెట్టాలి. దోచుకున్న సొమ్ము ప్రజల అకౌంట్లలో వేస్తాం." అని రాహుల్ తెలిపారు. "తెలంగాణలో కాంగ్రెస్ తుఫాన్ రాబోతుంది. ఓ కుటుంబం కోసం తెలంగాణ ఏర్పాటు చేయలేదు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం తెలంగాణ ఏర్పాటు చేశాం. కేసీఆర్ 24 గంటల ఉచిత విద్యుత్ వస్తోందా? కేసీఆర్ ఇంట్లో మాత్రమే విద్యుత్ ఉందేమో?, ఆయన ఇంట్లో నుంచి బయటకు రారు గనుక కేసీఆర్‌కు తెలియదు. కేసీఆర్ మాదిరి ఉత్తుత్తి మాటలు చెప్పం.. ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తాం. అలాగే అధికారంలోకి రాగానే కులగణన చేస్తాం. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం ఒక్కటే. తెలంగాణ ఎన్నికల తర్వాత మోదీని కూకటి వేళ్ళతో పెకిలిస్తాం" అని రాహుల్ పేర్కొన్నారు.

## గంగుల... నీలెక్క గుట్టలు మాయం చేశానా?.. సోయుండే మాట్లాడుతున్నావా?

### మంత్రి గంగులపై బీజేపీ నేత బండి సంజయ్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు



కరీంనగర్: మంత్రి గంగుల కమలాకర్‌పై బీజేపీ నేత బండి సంజయ్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. "గంగుల... నీలెక్క నేను గుట్టలు మాయం చేశానా? భూకబ్జాలు చేశానా? పేదల ఇండ్లు కూల్చి సంపాదించానా? తెలంగాణలో అత్యంత అవినీతిపరుడివి నువ్వే. కరప్షన్‌లో కరీంనగర్ టాప్ అని నిఘా నివేదికలే చెబుతున్న సోయి లేదా? నీకు బి.ఫాం ఇవ్వకుండా సతాయించింది నిజం కాదా. నేను అధికారంలోనే లేను.. నిరంతరం పోరాటాలే చేసిన. నేను అవినీతికి ఎలా పాల్పడతా?... సోయిండే మాట్లాడుతున్నవా. బీజేపీ నన్ను గౌరవించింది. హెలికాప్టర్ ఇచ్చి రాష్ట్రమంతా ప్రచారం చేయిస్తోంది.. ఆ సంగతి నీకు తెల్వదా. అసలు నువ్వు.. కరీంనగర్ ప్రజలకు ఒరగబెట్టిందేమిటి. రేషన్ కార్డు నీ చేతిలో పనే ఎందుకివ్వలేదు. వడ్ల కొనుగోలు నీ శాఖదే. అక్రమాలు ఎందుకు ఆపలేదు" అంటూ గంగుల కమలాకర్‌ను బండి సంజయ్ విరుచుకుపడ్డారు.

## డబుల్ బెడ్ రూం ఇళ్లపై తుమ్మల సంచలన వ్యాఖ్యలు



ఖమ్మం: కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. శుక్రవారం టేకులపల్లి డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీ కేసీఆర్ టవర్స్ వద్ద తుమ్మల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. కురిసే ఇళ్ళు కట్టినందుకు బీఆర్ఎస్‌కు ఓట్లు వేయాలా అని మండిపడ్డారు. పోలీసులతో బెదిరించినందుకు ఓట్లు వేయాలా అని నిలదీశారు. రాజకీయాలు మర్యాదగా, గౌరవంగా చేయాలని సూచించారు. చేసిన అభివృద్ధి పనులు చెప్పి ఓట్లు అడగాలి కానీ అరాచకంతో కాదని హితవుపలికారు. అభివృద్ధి పనులు చేసినోళ్లకు ప్రజలు పూలు వేస్తారన్నారు. బెదిరించి ఓట్లు అడిగితే చెప్పులతో మహిళలు కొడతారని హెచ్చరించారు. డబుల్ బెడ్ రూం ఇళ్ళు కమీషన్ల కోసం నాసిరకంగా కట్టారని విమర్శించారు. పోలీసుల బెదిరింపులు లేని, అవినీతి భూ కబ్జాలు లేని ఖమ్మం కోసం కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

# గజ్వేల్‌లో కేసీఆర్‌నీ మంచి మెజారిటీతో గెలిపించాలి



గజ్వేల్ (వాయిస్ టుడే): సిద్దిపేట జిల్లా, గజ్వేల్ నియోజకవర్గం, మర్కుక్ లో మంత్రి హరీశ్ రావు రోడ్ షో సందర్భంగా మాట్లాడారు. మర్కుక్ దశ, దిశ మార్చింది కేసీఆర్. నీళ్ల కష్టాలు తీర్చాడు. రోడ్లు లేక నాడు ఎంతో ఇబ్బందులు. నేడు డబుల్ రోడ్లు కనిపిస్తున్నాయి. గతుకుల గజ్వేల్ బతుకుల గజ్వేల్ చేసిండు. నెత్తిమీద గంగమ్మ లెక్క కొండపోచమ్మ సాగర్ తెచ్చింది కేసీఆరని అన్నారు. మా మండలం కేసీఆర్ అని గొప్పగా చెప్పుకుంటారు. తెలంగాణకు తొలి సీఎం కేసీఆర్, దక్షిణ భారతదేశంలో హ్యాట్రిక్ సీఎం కేసీఆర్. కష్టంలో లేడు, సుఖంలో లేడు ఎక్కడి నుండి వస్తున్నారు. ఎవడో వచ్చి బిడ్డ బిడ్డ అంటే నమ్మితే మాస పోతాం. ఇంకొకడు వస్తే రియల్ ఎస్టేట్ వ్యాపారం ఉండదు, అభివృద్ధి ఉండదు. నాడు నేను రాను బిడ్డో సర్కారు దవాఖాన అంటే నేడు పోదాం పద సర్కారు దవాఖాన అంటున్నారు. ఈసారి కారు గేలవగానే సన్నబియ్యం, పాత బియ్యం ఇవ్వబోతున్నాము. అసైన్డ్ ల్యాండ్స్ కి పట్టా ఇచ్చి హక్కులు ఇవ్వబోతున్నం. సిలిండర్ ధరలు పెంచిన బిజెపి వాళ్ళని ప్రశ్నించాలని అన్నారు. 400 లకే గ్యాస్ సిలిండర్ ఇవ్వబోతున్నాము.

రైతు బంధు 16 వేలు ఇవ్వబోతున్నాం. రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు 5 లక్షల జీవిత భీమా, అరోగ్య శ్రీ కింద 15 లక్షల దాకా వైద్యం అందిస్తాం. సౌభాగ్య లక్ష్మి 3000 ఇవ్వబోతున్నాం. బిజెపి అధికారంలోకి వచ్చే అవకాశం లేదు. ఒకటో, రెండో సీట్లు వస్తాయి. బూతులు మాట్లాడే వారికి పోలింగ్ బుతుల్లోనే బుద్ధి చెప్పాలి. గజ్వేల్ లో సీఎం కేసీఆర్ నీ మంచి మెజారిటీతో గెలిపించాలి. కాంగ్రెస్ వస్తె మూడు గంటల కరెంట్ వస్తది. 10 హెచ్పి మోటార్ ఎవరు కొనివ్వాలి. రేవంత్ రెడ్డికి వ్యవసాయం అంటే తెల్వదు. 30 తేదీన అందరం కారుకు గుద్దాలి. బీయారెస్ గెలిపించాలని కోరుతున్నానని అన్నారు. మంత్రి హరీశ్ రావు సమక్షంలో పలువురు బిజెపి నేతలు, కార్యకర్తలు పార్టీలో చేరారు.




## బీఆర్ఎస్‌కు ఫిలించాంబర్ మద్దతు

హైదరాబాద్‌సిటీ, (వాయిస్ టుడే): బీఆర్ఎస్ పార్టీకి, సీఎం కేసీఆర్‌కు మద్దతు తెలిపాలని నిర్ణయించుకున్నట్లు ఫిలించాంబర్ అధ్యక్షుడు రామకృష్ణగౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదేళ్లుగా చిత్ర పరిశ్రమకు సహాయ సహకారాలు అందిస్తున్నందున..సినీ కార్మికులందరూ ఈనెల 30న జరిగే పోలింగ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతునిస్తూ, కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. టికెట్ రేట్లు, స్పెషల్‌షో, షూటింగ్ లొకేషన్‌కు అనుమతులు..ఇలా చిత్రపరిశ్రమకు ఏ అవసరం ఉన్నా.. ప్రభుత్వం తరఫున మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాసగౌడ్, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, దానం నాగేందర్, పద్మారావుగౌడ్, ప్రకాష్ గౌడ్ తదితరులు వెంటనే స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో నటుడు సత్యప్రకాష్, నిర్మాతలు గురురాజ్, సాగర్, కాచం సత్యనారాయణ, రమేష్ నాయుడు, ఈవీఎం చారి, డైరెక్టర్లు బందూక్ లక్ష్మణ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ చెప్పే బూటకపు మాటలను నమ్మి మోసపోవద్దు

హైదరాబాద్ (వాయిస్ టుడే): బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చెప్పే బూటకపు మాటలను నమ్మి మోసపోవద్దని తెలంగాణ రాష్ట్ర బీఎస్పీ పార్టీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యానించారు. శుక్రవారం నాడు జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా బహుజన రాజ్యాధికార బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. బీఎస్పీ అభ్యర్థితో కలిసి ప్రవీణ్ కుమార్ బహిరంగ సభ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. సభలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. "అలంపూరు గడ్డలో పుట్టినా..నడిగడ్డలో మొలికెత్తిన విత్తనాలు తిని ఈ స్థాయికి ఎదిగాను. ఆంధ్ర పాలకుల దోపిడి వల్ల నష్టపోయిన సిర్పూర్ కాగజ్‌నగర్ గడ్డమీద పోటీ చేస్తున్నాను. అలంపూరు, సిర్పూర్ రెండు నియోజకవర్గాలు బహుజన్ సమాజ్ పార్టీకి రెండు కళ్ల లాంటివి. 2009లో కొంతమంది దుర్మార్గుల వల్ల వెయ్యి ఓట్లతో ప్రస్తుత అభ్యర్థి ఆర్ఎస్ ప్రసన్నకుమార్ ఓడిపోయారు. తుమ్మిళ్ల దగ్గర కావలి కుక్కలా రైతులకు సాగునీరు ఇస్తానని ప్రస్తుత ఎమ్మెల్యే మాట ఇచ్చారు.. గుంటనక్కల మారి ప్రజల జీవితాల్లో మన్ను పోశాడు. జూలకల్లు, మల్లమ్మ కుంట రిజర్వాయర్ల సంగతి అధ్వానంగా ఉన్న కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు" అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్డీఎస్ పనులకు మరమ్మతులు లేవు.. చేసిన మరమ్మతుల్లో కూడా భారీ కుంభకోణం చేసిన ఘనత మీది. తెలంగాణ ప్రభుత్వం కుళ్లు కుతంత్రాలతో నిండి ఉంది. తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబం పదేళ్ల నుంచి రాజ్యమేలుతుంది. పదేళ్లుగా తెలంగాణ దోపిడికి గురైంది. వాళ్ల ఫామ్ హౌస్‌లో డబ్బులు దాచుకున్నారు. రైతులు పంట



ఏ విధంగా మార్పిడి చేస్తారో.. ఈ రోజు కల్వకుంట్ల కుటుంబాన్ని ఈ ఎన్నికల్లో మార్చాలి. కేసీఆర్, రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి హెలికాప్టర్‌లో తిరుగుతూ... భూములను ఎలా దండుకోవాలి.. ఫామ్ హౌస్‌లు ఎలా నిర్మించుకోవాలో అని భూములను పరిశీలిస్తున్నారు. మేము హెలికాప్టర్లో తిరుగుతుంటే.. ప్రభుత్వ భూములను, భూస్వాముల దగ్గర గల భూములను పేదలకు ఎలా పంచాలో చూసేందుకు హెలికాప్టర్ నుంచి సర్వే చేస్తున్నాం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాదిగలకు నవంబర్ 11వ తేదీన క్షమాపణ చెప్తున్నానని అన్నారు. ఎన్నికల ముందు రిజర్వేషన్ ఇస్తా అంటున్నావు. పదేళ్లుగా మోదీ అధికారంలో ఉండి మాదిగలకు ఏం చేశారు" అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.



## బీఆర్ఎస్ ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు..

వికారాబాద్ (వాయిస్ టుడే): బీఆర్ఎస్ ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, భూములకు పట్టాల పంపిణీ జరిగిందని, తమ హయాంలోనే బొంరాస్ పేట్ అభివృద్ధి చెందిందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం వికారాబాద్ జిల్లా, బొంరాస్ పేట్, మండలంలో జరిగిన రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్-కృష్ణా రైల్వేలైన్ పూర్తి చేస్తామన్న బీఆర్ఎస్ హామీ నెరవేరలేదని, కృష్ణా జలాలు తీసుకోస్తామని మోసం చేశారని మండిపడ్డారు. మాదనపూర్ నుంచి ఇక్కడ తండాలకు రోడ్లు వేయించింది తానేనన్నారు. పదేళ్లలో ఈ ప్రాంతానికి సీఎం కేసీఆర్ చేసిందేమీలేదని, ఓటుకు పదివేలు ఇచ్చి బీఆర్ఎస్ గెలవాలనుకుంటోందని, డబ్బు, మద్యంతో ఎన్నికల్లో గెలవాలని ఆ పార్టీ నేతలు అనుకుంటున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బంగారు తెలంగాణ సంగతేమో కానీ.. భార్య మెడలో బంగారం అమ్మే పరిస్థితి తెలంగాణలో దాపురించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేసి తీరుతామని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రతీ నెల మొదటి తారీఖున రూ. 2,500 ఖాతాలో వేస్తామని స్పష్టం చేశారు.

రూ. 500లకే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తామని, మహిళలందరికీ ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, ప్రతీ ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని రేవంత్ రెడ్డి చెప్పారు. రైతులకు, కౌలు రైతులకు ఏటా ఎకరాకు రూ. 15 వేలు అందిస్తామన్నారు. రైతు కూలీలకు ఏటా రూ. 12 వేలు అందిస్తామని, ప్రతీ పేదవాడు ఇల్లు కట్టుకునేందుకు రూ. 5 లక్షల సాయం అందిస్తామన్నారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని, చేయూత పథకం ద్వారా నెలకు రూ. 4వేలు పెన్షన్ అందిస్తామని, ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

### కాంగ్రెస్‌ది 42 పేజీల మ్యానిఫెస్టో కాదు..

## 420 మ్యానిఫెస్టో

### మంత్రి హరీశ్ రావు



సిద్దిపేట (వాయిస్ టుడే): కాంగ్రెస్ పార్టీది 42 పేజీల మ్యానిఫెస్టో కాదు 420 మ్యానిఫెస్టో..అమలు సాధ్యం కానీ హామీలు ఇస్తూ ఆ పార్టీ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నదని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌లో నిర్వహించిన దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఎలాగూ గెలిచేది లేదని ఆచరణ సాధ్యం కాని హామీలతో..పేజీలకు పేజీలు రాశారు. కాంగ్రెస్ పార్టీకి విశ్వసనీయత లేదని విమర్శించారు.

కర్ణాటకలో కరెంట్ కష్టాలు చూస్తున్నాం. అనేక కష్టాలు అనుభవిస్తున్నారు. 420 మ్యానిఫెస్టోను కాంగ్రెస్ ప్రజల ముందుకు తెచ్చింది. జనం ఎక్కడ కొడతారో అని 24 గంటల కరెంట్ ఇస్తామని మ్యానిఫెస్టోలో పెట్టారని ఎద్దేవా చేశారు. ఈ ఆచరణ సాధ్యం కాని హామీలు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కాంగ్రెస్ అమలు చేస్తున్నదా? అని ప్రశ్నించారు. రైతు బంధు, కల్యాణ లక్ష్మి, గొర్రెల పంపిణీ ఇలా అందులో సగం మేము అమలు చేస్తున్నవే. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను కాంగ్రెస్ కాపీ కొట్టిందని ఆరోపించారు. అప్పులు సంతకం పెట్టి తెచ్చింది నువ్వే కదా ఈటల రాజేందర్. రెండేళ్లు అరోగ్య మంత్రిగా చేశావ్. అప్పుడు కేసీఆర్ మంచోడు అన్నవ్. గొప్పోడు అన్నవ్. పార్టీ మారంగనే మాట మార్చావ్. గజ్వేల్ అభివృద్ధి చెందినట్టు.. హుజురాబాద్ చేసావా.. ఓట్ల కోసం ఝూటా మాటలు మాట్లాడుతున్నావ్. అన్నం పెట్టిన కేసీఆర్‌ను మోసం చేసింది నువ్వు, సున్నం పెట్టింది నువ్వని ఆగ్రహం వ్యక్తం చేశారు. కారు గుర్తుకు ఓటేసి మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు.

## మదాపూర్‌లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాం

రంగారెడ్డి (వాయిస్ టుడే): ఫ్లైఓవర్లు, అండర్ పాస్ లు, లింక్ రోడ్లు వేసి మదాపూర్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు.. ఎన్నికల ప్రచారంలో భాగంగా మాదాపూర్ డివిజన్ లోని చంద్రు నాయక్ తాండ, అయ్యప్ప సొసైటీ, సాయి నగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, వార్డు మెంబర్ శ్రీనివాస్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ ల మ్యానిఫెస్టో లు పుస్తకం లోనే ఉంటాయని ఆచరణలో అమలు చేయరని ఎద్దేవా చేశారు.. ముఖ్యమంత్రి కేసీఆర్ మ్యానిఫెస్టోలో చెప్పినవి అమలు చేయడంతో పాటు ప్రజలకు ఉపయోగపడేవి మ్యానిఫెస్టోలో చెప్పనివి కూడా అమలు చేశారని గుర్తు చేశారు.. మంచినీటి రిజర్వాయర్లు కట్టి అయ్యప్ప సొసైటీ వాసుల దాహర్తిని తీర్చామన్నారు..



## ఎమ్మెల్యే గువ్వల బాలరాజు గెలుపుకు అందరం ఏకం కావాలి.....

### ఇంటి ఇంటి ప్రచారం, బతుకమ్మా లతో కేటి అన్నకి స్వాగతం ...

### కోమటికుంట లో బీఆర్ఎస్ ప్రచారం ముమ్మరం

నాగర్ కర్నూల్ (వాయిస్ టుడే): ఎమ్మెల్యే గువ్వల బాలరాజు గెలుపు కు అందరం ఏకం కావాలనీ బీ ఆర్ ఎస్ జిల్లా నాయకులు కేటి తిరుపతయ్య అన్నారు. శుక్రవారం లింగాల మండల పరిధిలోని కోమటి కుంట గ్రామానికీ ప్రచారంలో భాగంగా వేలడం తో వారికి గ్రామ సర్పంచ్, బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు అధిక సంఖ్యలో వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భగా కే టీ మాట్లడుతూ తూ కోమటి కుంట గ్రామానికీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ప్రత్యేక నిధులు మంజూరు చేసి గ్రామం లో మట్టి రోడ్ల ను,సి సి రోడ్ లు వేసిన ఘనత ఎమ్మెల్యే గువ్వల అని కొనియాడారు. అదే కాకుండా బాకారం నుంచి గ్రామానికీ బీ టీ రోడ్, కోమటి కుంట టు బొప్పల్లి కీ మెంటల్ రోడ్. గ్రామ ఆంజనేయ స్వామి గుడి నిర్మాణం కి ఆర్థిక సాయం. అందజేశారు. ఇవే కాకుండా రాష్ట్ర లో కేసిఆర్ మరెన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని అన్నారు. కె ఎల్ ఐ కాల్వల ద్వారా సాగునీరు ,రైతులకు ఏకరనికి 10 వెలు రైతు బంధు ద్వారా,5 లక్షలు రైతు బీమా ద్వారా, నుతన గ్రామపంచాయితీ లు, భావనలు నిర్మాణం కోసం నిదులు మంజూరు చేయడం. లింగాల మండలము లో ప్రతి గ్రామానికీ అనేక పథకాలను ప్రవేశపెట్టారని వారు గుర్తు చేశారు. నవంబరు 30 న జరిగే ఎన్నికలో గువ్వల బాలరాజు కి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీ తో గెలిపించాలని కోరారు. ఇంటి ఇంటి ప్రచారం చేపట్టారు. మహిళలు యువకులు నాయకులు డప్పు వాయిద్యాల మధ్య గ్రామంలో బీ ఆర్ ఎస్ పార్టీ ప్రచారం ముమ్మరంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బచ్చన్న ,బీ ఆర్ ఎస్ పార్టీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ ,బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు బళ్ళారి నాగేశ్వర్ కంప హరీష్, అంబి సందీప్, కే టీ రాజు,బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## సల్లంగా చూడయ్యా నాగరాజా

### మంథనిలో ఘనంగా నాగుల చవితి వేడుకలు

### పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు

మంథని (వాయిస్ టుడే): మంథని పట్టణంలో నాగుల చవితి వేడుకలను శుక్రవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. మంథని మున్సిపల్ పరిధిలోని బోయినిపేటలోని శ్రీ నాగులమ్మ ఆలయం తో పాటు, పెంజేరుకట్టలోని నాగుల సంధిలో శ్రీనాగమయ్య పుట్ట వద్ద భక్తులు పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సల్లంగా చూడయ్యా నాగరాజా అంటూ మహిళలు నాగదేవతలను వేడుకున్నారు. తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించి నోముల దారాలు, నువ్వులు, పండ్లు, పాలతో పాటు చలిమిడి ముద్దలు తయారు చేసుకుని పుట్టల వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేసి నాగుల చవితిని ఘనంగా జరుపుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మైసమ్మ, రావి, వేప చెట్లకు ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా మంథని మండలంలోని పలు గ్రామాల్లో నాగుల పంచమి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. గాజులపల్లిలోని శ్రీ సంతాన నాగేంద్రస్వామి ఆలయంతో పాటు గ్రామాల్లోని పుట్టల వద్ద పూలు, పండ్లతో భక్తులు పూజలు నిర్వహించారు. సంతాన నాగేంద్రస్వామిగా మంథని ప్రాంతంలో పేరుగాంచి ఉండటంతో గ్రామస్తులతో పాటు ఇతర గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున వచ్చి, పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయం సందడిగా మారింది.

## మంత్రి సత్యవతి రాథోడ్‌పై కేసు నమోదు

మహబూబాబాద్ (వాయిస్ టుడే): మంత్రి సత్యవతి రాథోడ్‌పై కేసు నమోదు అయ్యింది. ఎన్నికల నియమావళిని ఉల్లఘించారంటూ మంత్రిపై కేసు ఫైల్ అయ్యింది. మంత్రి రాథోడ్‌పై ఎన్నికల నిబంధన ఉల్లంఘున కింద 171-ఈ,171-హెచ్ ఐపీసీ ఆర్/డబ్ల్యూ 188 ఐఓసీ సెక్షన్ల కింద గూడూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గూడూరు మండలంలోని కొంగరగిద్దె గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి శంకర్ నాయక్‌తో కలిసి మంత్రి సత్యవతి రాథోడ్ ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో మంగళహారతి పట్టిన మహిళల హారతి పళ్లెంలో మంత్రి డబ్బులు పెట్టారు. ఈ అంశంపైనే సత్యవతిపై కేసు నమోదు అయ్యింది. వీడియో ఫుటేజ్ ఆధారంగా ఎన్నికల అధికారులు విచారణ జరిపి మంత్రి సత్యవతి రాథోడ్‌పై కేసు నమోదు చేశారు.